# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారతదేశ అభివృద్ధికి స్లోవేకియా అవకాశాలు కల్పిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పేర్కొన్నారు.
- భగవాన్ మహావీర్ దార్శనికతను నెరవేర్చడానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- జాతీయ దర్యాప్తు సంస్థ NIA ముంబయి ఉగ్రవాద దాడుల సూత్రధారి తహవ్వూర్ రాణాను భారత్ కు తిరిగి తీసుకొచ్చింది.
- సైబర్ దాడుల నుండి రక్షణకు అందరం కలిసికట్టుగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ వ్యాఖ్యానించారు.
- వక్ఫ్ సవరణ చట్టంపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ నెల 16వ తేదీన విచారించనుంది.

==============================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్లోవేకియా పర్యటనలో భాగంగా ఈరోజు బ్రాటిస్లావా నగరంలో స్లోవిక్ - ఇండియా బిజినెస్ ఫోరమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, విదేశాంగ మంత్రి జురాజ్ బ్లానార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పురోగమిస్తోందన్నారు. భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని, సమీప భవిష్యత్తులో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా పరిణమించాలనే లక్ష్యంగా పెట్టుకుందని ఉద్ఘాటించారు. స్లోవేకియా... పారిశ్రామిక బలం కలిగి ఉన్న దేశమని, భారత్ అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలను అందిస్తోందని రాష్ట్రపతి మాట్లాడుతూ..

(వాయిస్ బైట్.. 34 సెకన్లు)-సెట్

==============================

మహావీర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జైన సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. భగవాన్ మహావీరుడి ఆదర్శాలు ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి బలాన్ని ఇస్తున్నాయని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. మహావీర్ దార్శనికతను నెరవేర్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రాకృతానికి ప్రాచీన భాష హోదాను మంజూరు చేస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా ప్రశంసలు వచ్చాయని ప్రధానమంత్రి వివరించారు.

==============================

జాతీయ దర్యాప్తు సంస్థ NIA 26/11 ముంబయి ఉగ్ర దాడుల సూత్రధారి తహవుర్ రాణాను ఈరోజు భారత్ కు తీసుకొచ్చింది. మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న రాణాను NIA తీహార్ జైలుకు తరలించింది. తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసులు NIA కోర్టు ముందు ఆయనను ప్రవేశపెట్టనున్నారు.

తహవ్వూర్ రాణా కేసులో విచారణ కోసం కేంద్ర ప్రభుత్వ న్యాయవాది నరేందర్ మాన్‌ను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ నెల 16వ తేదీన విచారించనుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులను విచారించనుంది. వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టులో ఇప్పటికే అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ చట్టం గత మంగళవారం అమల్లోకి వచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజకీయ, సైనిక లక్ష్యాలతో కొందరు సైబర్ దాడులకు పాల్పడుతున్నారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు తమిళనాడులోని డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజ్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం జరుగుతున్న సంఘర్షణలు సంప్రదాయ యుద్ధాలకు భిన్నంగా రూపాంతరం చెందుతున్నాయని చెప్పారు. నానాటికీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత.. మానవ ప్రమేయం లేని వ్యవస్థను సృష్టిస్తోందని, చాలా విషయాలను కృత్రిమ మేధ AI అంచనా వేయడం జరుగుతోందని అన్నారు. సంప్రదాయ యుద్ధాలు చేసుకునే కాలం పోయి... AI రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోందని రాజనాధ్ సింగ్ వివరిస్తూ...

(వాయిస్ బైట్.. 39 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబై ఉగ్రవాద దాడుల నిందితుడు తహవ్వూర్ రాణా తిరిగి రావడం భారతప్రభుత్వ దౌత్యానికి గొప్ప విజయమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. భారత ప్రజలతో అనుచితంగా ప్రవర్తించిన వారందరినీ తిరిగి తీసుకురావడం భారత ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తహవ్వూర్ రాణాపై భారతదేశ న్యాయస్థానంలో విచారణ జరగడం దేశానికి గొప్ప విజయమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ... పౌరసత్వ సవరణ చట్టం(CAA)పై అసత్యాలు వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. CAA అమలు కారణంగా ముస్లింల పౌరసత్వం తీసివేయబడుతుందనే వదంతులను వ్యాప్తి చేశారని, అయితే ఈ చట్టాన్ని అమలు చేసినప్పటి నుండి ఒక్క ముస్లిం కూడా తన పౌరసత్వాన్ని కోల్పోలేదని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా సుంకాల విషయంలో భారత్ జాగ్రత్తగా వ్యవహరిస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. వివిధ దేశాలపై విధించిన సుంకాలను అమెరికా 90 రోజుల పాటు నిలిపివేసిన నేపథ్యంలో ఆయన ముంబయిలో పాత్రికేయులతో మాట్లాడారు. అమెరికాతో వాణిజ్యాన్ని రెండున్నర రెట్లు పెంచుకోవడంపై భారత్ దృష్టి సారించామన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, సులభతర వాణిజ్యం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఇరు దేశాలు గత ఫిబ్రవరిలో ఒప్పందం చేసుకున్నాయని గుర్తు చేశారు. ఇరు దేశాల వాణిజ్యం.. 500 బిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పీయూష్ గోయల్ వివరిస్తూ..

(వాయిస్ బైట్..37 సెకన్లు)- సెట్

అదే విధంగా.. భారతదేశ ఎగుమతులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 820 బిలియన్ అమెరికన్ డాలర్లు దాటాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన 778 బిలియన్ డాలర్ల కంటే ఇది దాదాపు 6 శాతం అధికమని పేర్కొంది. వాణిజ్య అభివృద్ధిపై చర్చించేందుకు ఈరోజు న్యూఢిల్లీలో ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్‌లు, పరిశ్రమ సంస్థలతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె పి నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్యక్రమాన్ని ప్రారంభించి, లబ్దిదారులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె.పి.నడ్డా మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన... ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య భద్రతా కార్యక్రమమని, దీని కింద ప్రస్తుతం దేశంలో 62 కోట్ల మంది ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. రేఖ గుప్తా మాట్లాడుతూ, ఢిల్లీ ప్రభుత్వం నగర వాసులకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద 1,749 కోట్ల రూపాయల ఖర్చుతో 1,139 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, అమెరికా దేశాల సాయుధ దళాలు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయాంఫ్ 2025 విన్యాసాల సమగ్ర శిక్షణ దశ ముగిసింది. ఈ ట్రై-సర్వీస్ హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ కార్యక్రమం.. రెండు మిత్రదేశాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో కొనసాగుతోంది. విన్యాసాలలో భాగంగా హార్బర్ దశ విజయవంతంగా పూర్తి చేసుకొని, బృందాలు సముద్ర దశ కోసం కాకినాడకు వెళుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా గుజరాత్ లోని గాంధీనగర్‌లో అతిపెద్ద హోమియోపతి సింపోజియంను నిర్వహించనున్నామని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో 100 మిలియన్లకు పైగా ప్రజలు ఈ చికిత్సా విధానంపై ఆధారపడి ఉన్నారని పేర్కొంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, దేశంలో ప్రస్తుతం 3లక్షల 45వేల మంది రిజిస్టర్డ్ హోమియోపతి వైద్యులు, 277 హోమియో ఆసుపత్రులు, 8 వేల 593 హోమియో డిస్పెన్సరీలు, 277 హోమియో విద్యా సంస్థలు ఉన్నాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఈరోజు ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బాటింగ్ చేస్తున్న (RCB) 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 4 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =